## కల్లూరులో అనుమానాస్పద మృతి

**మోరి పక్కన సెంట్రింగ్ మేస్త్రి మృతదేహం లభ్యం**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని కప్పల బంధం రోడ్డులో సట్టేరు కుంట మోరి సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యం కావడంతో స్థానికంగా కలకలం రేగింది. మృతుడిని సెంట్రింగ్ మేస్త్రిగా పనిచేస్తున్న షేక్ హబీబ్గా గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అయితే హబీబ్ ప్రమాదవశాత్తు మోరి పైనుంచి కిందపడి మృతి చెందాడా, ఇతర కారణాలతో మృతి చెందాడా అనే విషయంపై స్పష్టత రాలేదని పోలీసులు తెలిపారు. శవం గుర్తుపట్టలేని స్థితిలో ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు గత రెండు రోజులుగా షేక్ హబీబ్ కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఆచూకీ కోసం వెతుకుతున్న సమయంలో మోరి పక్కన మృతదేహం కనిపించిందని పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం మృతికి గల అసలు కారణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

**లారీ క్యాబ్లోనే తుదిశ్వాస విడిచిన ఎల్లయ్య**

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** పెనుబల్లి మండలం ముత్తగూడెం సమీపంలో గురువారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ ఎస్.ఎల్లయ్య (65) లారీ క్యాబ్లోనే గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. ఎల్లయ్య లారీ నడుపుతూ ముత్తగూడెం ప్రాంతానికి చేరుకోగా తీవ్ర ఎండల కారణంగా అలసిపోయి విశ్రాంతి కోసం లారీని రోడ్డుపక్కన నిలిపి క్యాబ్లోనే నిద్రించాడు. ఈ క్రమంలో ఆయనకు గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. చాలా సేపు లారీ అనుమానాస్పదంగా నిలిచి ఉండటాన్ని గమనించిన స్థానికులు దగ్గరకు వెళ్లి చూడగా డ్రైవర్ స్పందించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఎండల తీవ్రత, వృద్ధాప్యం కారణంగా గుండెపోటు వచ్చి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

## ఖాళీ బిందెలతో మహిళల నిరసన

**వారం రోజులుగా నీటి ఎద్దడి**

**తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్**



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం బోయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బర్లగూడెం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై గ్రామ మహిళలు గురువారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఐదు రోజులుగా మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరగడం లేదని తెలిపారు. గ్రామ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో సోలార్ నీటి పథకం ఏర్పాటు చేసినప్పటికీ అది కూడా ప్రస్తుతం పనిచేయడం లేదని పేర్కొన్నారు. దీంతో తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. సంబంధిత మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని, గ్రామ ప్రజల సమస్యను పరిష్కరించాలని మహిళలు డిమాండ్ చేశారు.

## రామేశ్వర్ పల్లిలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం

**ఉద్యమ కెరటం,భిక్కనూర్:**

పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాల గృహప్రవేశ కార్యక్రమం గురువారం భిక్కనూర్ మండలం రామేశ్వర్పల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులను అభినందించారు. నూతన గృహాల్లోకి ప్రవేశించిన కుటుంబాలకు నూతన వస్త్రాలను కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, సొంత ఇంటి కల నెరవేరడం జీవితంలో మరచిపోలేని ఘట్టమని అన్నారు. గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గృహప్రవేశ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చేపూరి రాణి రాజు, ఉపసర్పంచ్ గొల్లపల్లి వినోద్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్ది సూర్యకాంత్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రమేష్ రెడ్డి, టెంపుల్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, వార్డు సభ్యులు కృష్ణారెడ్డి, శశికుమార్, పనాసా రాజు, భవాని ధర్మస్వామి, చంద్రకళ వీరేశం, కూతరు రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, వీడీసీ కార్యదర్శి నాగర్తి భూం రెడ్డి, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించిన మట్టా రాగామయి దయానంద్
- ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధుల బాధ్యత
- ఫోన్ ద్వారా నేరుగా ఎమ్మెల్యేతో మాట్లాడి తమ సమస్యలు చెప్పిన ప్రజలు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వేగవంతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గురువారం సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఫోన్ ద్వారా నేరుగా ఎమ్మెల్యేతో మాట్లాడి తమ సమస్యలు, అభ్యర్థనలు, అభివృద్ధి అవసరాలను వివరించారు. ప్రజలు తాగునీటి సమస్యలు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలు, ఇండ్ల పట్టాలు, రెవెన్యూ అంశాలు, భూ వివాదాలు, పింఛన్లు, సంక్షేమ పథకాల అమలు, గృహ నిర్మాణాలు, విద్యా, వైద్య రంగాలకు సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే ఓపికగా విని, సంబంధిత శాఖల అధికారులకు వెంటనే సమాచారం అందించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపగా, మరికొన్ని అంశాలపై పూర్తి వివరాలు సేకరించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధుల బాధ్యత అని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి సమస్యను బాధ్యతగా తీసుకుని పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకునే అవకాశం కల్పించిన ఎమ్మెల్యేను పలువురు అభినందించారు. ప్రజలకు చేరువయ్యే ప్రజాపాలనకు ఈ కార్యక్రమం నిదర్శనమని, ఇలాంటి కార్యక్రమాలు ప్రజా సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన వేదికలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.

# చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలే తొలి అడుగు

- పిప్పలకోటి సర్పంచ్ దాసరి రమేష్
- ఘనంగా 'అమ్మ మాట - అంగన్వాడీకి బాట

**ఉద్యమ కెరటం, భీంపూర్:** చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలే తొలి అడుగులని, ప్రతి తల్లి తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని పిప్పలకోటి గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన 'అమ్మ మాట – అంగన్వాడీకి బాట' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తోందని తెలిపారు. అలాగే చిన్నారులకు ఆటాపాటలతో కూడిన నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు తమవంతు పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మస్కరి



ప్రవీణ్, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారుల తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకర జీవనానికి యోగా అవసరం

- మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష
- రిమ్స్ లో యోగా దినోత్సవ మార్నింగ్ వాక్ ప్రారంభం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆరోగ్యకర జీవనానికి యోగా అవసరమని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా సతీష్ అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ వైద్య కళాశాల నుంచి గురువారం మార్నింగ్ వాక్ ను జెండా ఊపి నిర్వహించారు. ఈ



కార్యక్రమంలో వైద్యులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మారుతున్న జీవనశైలిలో యోగా, ఉదయం నడక ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రతిఒక్కరూ తమ రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని సూచించారు. యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని, యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సాధన, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్, ఆయుష్ విభాగం వైద్యులు, రిమ్స్ కళాశాల అధ్యాపకులు, నర్సింగ్ కళాశాల సిబ్బంది, వైద్య విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇంటి స్థలం నా బాధ్యత

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- పండుగ వాతావరణంలో కొత్తగూడెం ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవం

**ఉద్యమ కెరటం, భద్రాద్రి కొత్తగూడెం :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నా వంతుగా కృషి చేస్తున్నానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇప్పించే విషయమై ఇప్పటికే పలుమార్లు సీఎంతోనూ మాట్లాడనని అన్నారు. కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన కొత్తగూడెం ప్రెస్ క్లబ్ ను కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్ కలిసి ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలన్నారు. జర్నలిస్టుల కోసం కొత్తగూడెంలో పది ఎకరాల స్థలాన్ని ఇతరత్రా వాటికి కేటాయించకుండా కాపాడుతున్నానన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు తాను ఎప్పుడు అండగా



ఉంటానన్నారు. నగరంలో సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కె. సాబీర్ పాషా మాట్లాడుతూ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం ఎమ్మెల్యే తీవ్రంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా హామీలతోనే కాలం వెళ్లబుచ్చిందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇండ్ల స్థలాల విషయంలో జాప్యం చేస్తుండడం బాధాకారమన్నారు. ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవంలో



వెలుగు స్టాఫ్ రిపోర్టర్ కీలక భూమిక పోషించడం అభినందనీయమన్నారు. ఈ ప్రోగ్రాంలో సీనియర్ రిపోర్టర్లు పోతు రాజేందర్, లోగాని శ్రీనివాస్, ఇమంది ఉదయ్ కుమార్, యెర్రా ఈశ్వర్, జునుమాల రమేష్, కల్లోజి శ్రీనివాస్, మోటమర్రి రామకృష్ణ, శంకర్, లక్ష్మణ్, అఫ్జల్, కృష్ణ గోవింద్, కాగితపు వెంకటేశ్వర్లు, నర్సింహ్మా, పండుగ రేశ్వంత్, రవి, రాజేశ్, కుమార్, నాగాచారి, భాస్కర్, సురేష్, పూర్ణ, పాపారావు, రాజేష్, కృష్ణారావు, సుధాకర్, శ్రీనివాస్, షఫి, ఉమాకాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

# వ్యక్తిగత వ్యాఖ్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాషను మార్చుకోవాలి
- బీఆర్ఎస్ నేత కొంగ సత్యనారాయణ

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకులపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొంగ సత్యనారాయణ అన్నారు. గురువారం కాగజ్నగర్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో విమర్శలు ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలపై ఉండాలే తప్పా వ్యక్తిగతంగా అవమానించేలా ఉండకూడదన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న నాయకుడు రాజకీయ ప్రత్యర్థులను ఉద్దేశించి "గుండు, అరగుండు" వంటి పదజాలం ఉపయోగించడం సమంజసం కాదని విమర్శించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై దృష్టి సారించాలని, వ్యక్తిగత విమర్శలతో రాజకీయ వాతావరణాన్ని దిగజార్చవద్దని సూచించారు. రాజకీయ నాయకులు పరస్పర గౌరవంతో వ్యవహరిస్తే ప్రజలకు మంచి సందేశం వెళ్తుందని పేర్కొన్నారు.



ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు గోలెం వెంకటేశం, వంజరి సర్పంచ్ గోపాల్, కాగజ్నగర్ మండల అధ్యక్షుడు పార్వతి అంజన్న, హనుమంత వాసాకే, శ్రీనివాస్, తాండ్ర నవీన్, సిర్పూర్ మహిళా నియోజకవర్గ కోకన్వీనర్ కమల, టౌన్ మహిళా కన్వీనర్ తాండ్ర వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీల అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలోని గ్రామపంచాయతీల అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ తో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామపంచాయతీల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని, పంచాయతీ నిధులను ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయాలని తెలిపారు. త్వరలో 16వ ఆర్థిక సంఘం ప్రారంభం అవుతుందని, 14, 15 ఆర్థిక సంఘాల నిధులను గ్రామ పంచాయతీల అభివృద్ధికి పూర్తిగా ఖర్చు చేయాలని తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం క్రింద అర్హులైన లబ్ధిదారుల ప్రతిపాదనలను త్వరగా పంపించాలని, ఆసరా పింఛన్ల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని, 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల కొరకు గుడిసెలలో నివసించే వారి వివరాలను పరిశీలించి నివేదిక రూపొందించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాలలో పారిశుద్ధ్య పనులు ప్రతిరోజు చేపట్టాలని, నివాస ప్రాంతాలలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన త్రాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, వ్యాధుల నియంత్రణకు పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని, పగటివేల వీధి దీపాలు వెలగకుండా నియంత్రికలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో అవసరమైన చోట ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని, ఈ నెల 28వ తేదీన చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుండి జూలై 24 వ తేదీ వరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి వారాలు అందించి అవసరమైన ధృవపత్రాలు సేకరించాలని, ఈ ప్రక్రియను విజయవంతం చేయడానికి పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నమ్మకం.. నకిలీలపై నిఘా..!

## నకిలీ విత్తనాల విక్రయాలపై ఉక్కుపాదం

- **కలెక్టర్ కె. హరిత ఆకస్మిక తనిఖీలు**
- **స్టాక్ రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం..!**





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. గురువారం ఆసిఫాబాద్ మండలం బురుగూడా గ్రామంలోని 'కళావతి ట్రేడర్స్ ఫర్టిలైజర్ షాప్'ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని పత్తి విత్తనాల ప్యాకెట్లను పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న విత్తనాలు, ఎరువుల స్టాక్ వివరాలను రిజిస్టర్‌లో సరిగ్గా నమోదు చేయకపోవడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని యజమానిని ఆదేశించారు. అలాగే దుకాణంలో ఏర్పాటు చేసిన బోర్డుపై అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువుల వివరాలను రైతులకు కనిపించేలా స్పష్టంగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. రైతులను మోసం చేసే విధంగా నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తే ప్రభుత్వం ఏమాత్రం సహించదన్నారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.ప్రభుత్వం నిషేధించిన గడ్డి మందులు లేదా ఇతర ప్రమాదకర వ్యవసాయ రసాయనాల విక్రయాలు జరిపితే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా ఎరువులు, విత్తనాల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, డీలర్లు అందరూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆమె సూచించారు.

# మైనర్ బాలికపై లైంగిక వేధింపు కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు

## రూ.2వేల జరిమానా







**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ తీర్పునిచ్చినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక పట్ల అదే గ్రామానికి చెందిన శివరాత్రి శ్రీనివాస్ అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు గంభీరావుపేట పోలీస్ స్టేషన్లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్సై మహేష్ కేసును దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించడంతో పాటు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణ సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో మొత్తం ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రభుత్వ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్ వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు, శాస్త్రీయ ఆధారాలను పరిశీలించిన జడ్జి ఈ మేరకు తీరుపనిచ్చారు. నేరాలకు పాల్పడిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని, పోలీసులు–ప్రాసిక్యూషన్ సమన్వయంతో నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, అప్పటి ఎస్సై మహేష్, పీపీ రజినీకాంత్, గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్, కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీందర్ నాయుడు, కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# ఎల్పీజీ వినియోగదారులు బ్యాంకు ఖాతాలను ఆధార్తో అనుసంధానం చేసుకోవాలి

- **ఈనెల 30లోపు ప్రక్రియ పూర్తి చేయాలి**
- **జిల్లా అదనపు కలెక్టర్ వి. రాములు**



**మంచిర్యాల:** జిల్లాలోని ఎల్పీజీ వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యక్ష లబ్ధి బదిలీ (డీబీటీఎల్–పహల్) పథకం ద్వారా గ్యాస్ రాయితీని నిరంతరంగా పొందేందుకు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్తో అనుసంధానం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు సూచించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడారు. ఎల్పీజీ వినియోగదారుల బ్యాంకు ఖాతాలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో (ఓఎంసీలు) అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాలను ఆధార్తో అనుసంధానం చేయని వినియోగదారులు ఈనెల 30వ తేదీలోపు తప్పనిసరిగా ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. నిర్దేశిత గడువులోగా ఆధార్ అనుసంధానం చేయని వినియోగదారులకు గ్యాస్ సబ్సిడీ జమ కావడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. అయితే ఎల్పీజీ రీఫిల్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేలా ఆధార్ అనుసంధానం కీలకమని పేర్కొన్నారు. వినియోగదారులు వెంటనే తమ బ్యాంకులను, గ్యాస్ ఏజెన్సీలను సంప్రదించి ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.

### రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ పూర్తి చేయాలి

జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందించేందుకు ఈ–కేవైసీ ప్రక్రియ కీలకమని తెలిపారు. ప్రతి రేషన్ కార్డులో నమోదైన సభ్యులందరూ తప్పనిసరిగా ఈ–కేవైసీ పూర్తి చేయాలని పేర్కొన్నారు. రేషన్ కార్డుల్లో నమోదైన సభ్యుల వివరాల్లో పారదర్శకతను నిర్ధారించడం, నకిలీ నమోదులను నివారించడం, అర్హత కోల్పోయిన వారిని గుర్తించడం, రికార్డులను నవీకరించడం వంటి అంశాలకు ఈ–కేవైసీ ఉపయోగపడుతుందని వివరించారు. ఇప్పటివరకు ఈ–కేవైసీ చేయించుకోని రేషన్ కార్డుదారులు తమ సమీపంలోని చౌకధరల దుకాణాలను సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన ఈ–పీఓఎస్ యంత్రం ద్వారా వెంటనే ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిరంతరంగా పొందేందుకు ఈ–కేవైసీ పూర్తి చేయడం అత్యవసరమని తెలిపారు.

# జహీరాబాద్‌లో త్రివేణివనం ఎకో పార్కు ప్రారంభం

**ఉద్యమ కెరటం,జహీరాబాద్ :** జహీరాబాద్ పట్టణ శివారులో జాతీయ రహదారి పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన త్రివేణివనం–ఫారెస్ట్ ఎకో పార్కును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చని వాతావరణం నెలకొల్పాలనే లక్ష్యంతో వనమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 11 ఎకో పార్కులను ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. జహీరాబాద్ ప్రాంతం నిమ్జ్ ద్వారా పారిశ్రామిక స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకుంటోందని, భారీ పరిశ్రమల రాకతో యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. జాతీయ రహదారి పక్కనే 208 ఎకరాల విస్తీర్ణంలో త్రివేణివనం ఎకో పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని కాసు బ్రహ్మానందరెడ్డి నేషనల్ పార్క్ లో ఉన్న అనేక సౌకర్యాలను ఇక్కడ కూడా కల్పించినట్లు చెప్పారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు.

# నీట్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు


## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** నీట్–2026 పరీక్ష పునఃనిర్వహణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ ఎ.భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీక్ ఘటన నేపథ్యంలో ఈనెల 21న పరీక్షను తిరిగి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,204 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజీవ్‌నగర్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల–జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష నిర్వహణ కోసం కట్టుదిట్టమైన బందోబస్తు, సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రశ్నాపత్రాల భద్రత, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, తనిఖీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో భద్రతా చర్యలు పటిష్టం చేశామని, మహిళా అభ్యర్థుల తనిఖీల కోసం మహిళా పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రపర్చే ప్రక్రియపై ప్రత్యేక నిఘా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీతో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, పోలీసు బందోబస్తు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, డిజిటల్ పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని, అభ్యర్థుల తనిఖీలు కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యా సంస్థల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం కాసిపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు, వంటశాల, స్టోర్ రూమ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, బాల బాలికలకు వేర్వేరు మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, అదనపు తరగతి గదులు వంటి మౌలిక సదుపాయాలను కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని, ఆహార తయారీలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని, నిత్యావసర వస్తువులను క్రమపద్ధతిలో నిల్వ ఉంచాలని సూచించారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను తనిఖీ చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలో అమృత్ 2.0 పథకం కింద కొనసాగుతున్న నీటి ట్యాంకులు, పైప్లైన్ నిర్మాణ పనులను తహశీల్దార్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ రమేష్, చైర్పర్సన్ దావ స్వాతి తదితరులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కోసం పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. అలాగే రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణ పనులను తనిఖీ చేసి, నిరుపేదల కోసం చేపట్టిన ఈ గృహ నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

